# పాడైన ఆట

శ్రీ టి. ఎల్. నరసింహారావు

ఆనాడు ఆదివారం-పగలు పదకొండు గంటలవుతోంది. శీనిగాడికి వాళ్లమ్మ ముందే అన్నం పెట్టేసింది. అన్నం తినేసి, చావడిలో ఆడుకుంటున్నాడు. ప్రతిరోజూ యింతే - అందరితోపాటు పెడితే అన్నం సరిగా తినక అల్లరి చేస్తాడని వాళ్లమ్మ ముందుగా వాడికి అన్నంపెట్టేసి ఆడుకోమని సావిట్లోకి పంపేస్తుంది.

శీనిగాడు సన్నగా ఉంటాడు- గట్టిగా ఊదితే పడిపోయేటట్టు. గుండ్రటి ముఖము. ఆ ముచ్చటైన జుట్టు ఎప్పుడు చూసినా ముందుకు పడి ముఖమంతా కప్పుకుపోయి వుంటుంది. వాళ్లమ్మ ఎన్నిసార్లు దువ్వినా రేపేసుకుంటాడు - అల్లరి కుంక!

ఓ పక్క మూత లేని పాత పౌడరుడబ్బా, తన రబ్బరుజోళ్లు ముందర పెట్టుకు కూర్చున్నాడు. వాళ్ల పెద్దన్నయ్య జోడూ, బ్రష్, నాన్నగారి బల్లమీద సిరాబుడ్డి పట్టుకవచ్చాడు. సిరా కింద గుమ్మరించి, బ్రష్ అందులో ముంచి, ఆ బ్రష్ ఒక చేతితోను- జోడు ఒక చేతితోను పట్టుకొని

"ఓ! ఓ! ఓ!! ఓ యమ్మ! యమ్మా...

నీకు నీకుమా...

"ఓయమ్మ! నీకుమారుడు మా యింట్లను పెఱుగు మననీడమ్మా పోమెదము...పోమెద..." అని పాడుకుంటూ జోడుకి సిరాపులమటం ప్రారంభించాడు. చేతులనిండా సిరా అయింది.

ఇంతలో వాళ్ల నాన్నగారు అన్నం తిని చేయి కడుక్కొని మీసాలు సవరించుకుంటూ యివతలకువచ్చి "ఏమిటోయ్, శీనాయి?" అన్నారు.

"లేదు - నాన్నా మరి నేను పెద్దన్నయ్యని! జోళ్లకిరంగేచుకొని ఊ కెళ్తా-"

వచ్చీరాని ముద్దుమాటలు విని వంటయింట్లో పని చేసుకొంటున్న వాళ్లమ్మ మురిసిపోతూ సావిట్లోకి వచ్చింది. తీరావచ్చి చూడగానే ఆవిడమురిపెమంతా మాయమైపోయింది. పట్టరాని కోపం వచ్చేసింది-

"వెధవపనులు, నువ్వూను-ఛీ" అంటూ పెరట్లోకి రెక్కట్టుకు ఈడ్చుకెళ్లి శీనప్పగాడి సిరా చేతులు కడిగింది.

శీనప్ప కిక్కురుమనలేదు. కళ్లు రెండూ నీళ్లతో నిండిపోయినాయి. గబగబా చావడిలోకి పరుగెత్తుకువచ్చి, వాళ్లనాన్నను చూచాడు. నాన్నను చూడగానే వాడికి ఏడుపు ఆగలేదు. ఒక్కసారిగా ఏడుపు ఆరంభించి-"అమ్మ-నన్నుకొట్టిందీ- ఇ...ఇ...ఇ" అని వెక్కి వెక్కి ఏడుస్తూ వాళ్ల నాన్నగారితో పి. రారీ చెప్పాడు.

"లేదు శీనా! అమ్మను కొడదాంలే, వుండు — రానీ-మరీ, నేను చెప్పిన పద్యాలు అన్నీ వచ్చాయా?" అని వాడి కన్నీళ్లు తువ్వాలుతో తుడిచారు వాళ్ల నాన్నగారు.

ఏడుపు మాట మరిచిపోయి "ఏం పద్యం" అంటూ, పెద్ద కలకండముక్క చేతికిచ్చినంత సంతోషంతో అడిగాడు.

"నువ్వు చెప్పు" అన్నారు వాళ్లనాన్న.

"ఆ! నువ్వే చెప్పునాన్నా"

"అయితే... 'బాలురకు' ..."

"అప్పుడే నాకొచ్చేసిందినాన్నా అది"

"పాడు మరి-"

"బాలురకు పాలు లేవని బాలెంతలు..." నాన్నా బాలెంతలంటే ఏంటి?

"అక్కయ్యకు పాపాయి పుట్టిందా?- అప్పుడు అక్కయ్య బాలెంత అన్నమాట."

"అంటే?"

"అంటే - చిన్నిబుల్లి పాపాయి ఎవరికి పుట్టితే వాళ్లమ్మ బాలెంత అన్నమాట."

"ఉ ... బాలురకు పాలులేవని బాలెంతలు మొఱలుపెట్ట పక పక నగి యీ బాలకు డాలము సేయుచు'... 'ఆలకు'-అంటే ఆవులకు కదూ నాన్నా ?...ఆలకు-తరవాతేంటి నాన్నా...

"క్రే..."

"ఆ! క్రేపు ... నువ్వు చెప్పు నాన్నా-"

"క్రేపులను"

"ఉండు -ఉండు నాన్న; నువ్వు చెప్పకు - క్రేపులను విడిచె నంభోజాక్షి"

"గుడ్ ... గుడ్! తరువాత?"

"మరి... ఆ ... అది నాన్నా" అంటూ పరుగెత్తి మూలున్న రబ్బరు బంతి పట్టుకొస్తూ—

"చే...బంతి"

"వచ్చిందా అది? పాదు మరి?"

"ఓ... చే బంతి తప్పిపడెనని ప్రాబల్యము తోడ వచ్చి
బబనము వెనుకన్

"బబనము కాదురా! భవనము వెనుకన్"

"భ...బ...నము వెనుకన్

"ఏమిటి - భవనము వెనుక ఏం జరిగింది?"

"మా బిడ్డ జలకమాడగ"

"ఉ... ఏం చేశాడు చెప్పు, కృష్ణుడు?"

"నీ బిడ్డడు వలువ దెచ్చె నెలతుక తగునే"

"భేష్ ... ఇంకో పద్యం చెప్పనా..."

"ఊ ఊ"

మా చిన్నతమ్ముడు యీ ఏడాది రెండో క్లాసులోకి వచ్చాడు. వాడికి స్కూల్లో చెప్పిన సైన్సు అర్థంకాక ఒకరోజు నా దగ్గరకు వచ్చి "టెలిగ్రాఫ్ అంటే ఏమిటిరా?" అని అడిగాడు.

"ఎక్కడో బొంబాయిలో వున్న మన మామయ్యతో మనం యిక్కడి నుంచీ మాట్లాడాలంటే టెలిగ్రాఫే సాధనం" అన్నాను.

"అది ఎట్లా పని చేస్తుంది?"

ఒక్క క్షణం ఆలోచించాను - "ఇక్కడి నుంచీ బొంబాయి ఎంత దూరం వుందో అంత పొడుగున తాచుపాము ఒకటి వున్నదనుకో. మనం యిక్కడ దాని తోకమీద తొక్కగానే అక్కడ బొంబాయిలో అది తలపైకెత్తుతుందన్న మాట!"

"మరి రేడియో ఎలా పని చేస్తుంది?" అని అడిగాడు వాడు. రెండు క్షణాలు ఆలోచించాను - "అదీ యిల్లాగే! కాకపోతే మధ్యలో ఆ పాము మాత్రం వుండదు. అంతే వ్యత్యాసం" అన్నాను.

"చెప్పకో 'అరవిందంబుల కంటె..."

"అర..." ఏంటి నాన్న ఇది?"

"అరవిందంబుల కంటె"

ఇల్లా పద్దెం చెబుతూండగానే చిట్టిగాడు పరుగెత్తుకొచ్చి "శీనప్పా! దారా ఆడుకుందాం" అన్నాడు. చిట్టిగాడు శీనప్పకంటె ఓ ఏడాది పెద్ద. చిట్టికి ఆరో సంవత్సరం. పుస్తకం ఆయేడే పట్టాడు. కాస్త ఒడ్డూ పొడుగూ ఉంటాడు.

వెంటనే శీనప్ప వాళ్ల నాన్న దగ్గర నుంచి లేచాడు..."మళ్లీ శ్లోకం చెప్పు ఆడుకుంటాను నాన్నా" అంటూ బిరబిరా పరుగెత్తాడు చిట్టితో సహా!

ఇంతలో రాజు ఉష చెరో జంతిక పట్టుకొని ఎగురుకుంటూ చక్కా వచ్చారు. రాజు అంటే-ఎదురింటి వాళ్ల బ్బాయి; ఉష వాడి చెల్లెలు. వీళ్లు కూడా చిట్టి చదువుకొనే బడిలోనే వాడి తరగతే చదువుకుంటున్నారు.

"ఎక్కడిదిరా రాజు, ఆ జంతిక నాక్కొంచెం పెట్టరా! ఒరే ఒరే-" అన్నాడు చిట్టి. రాజు వాడికి కొంచెం విరిచి యిచ్చాడు.

"నాక్కూడా" అన్నాడు శీనిగాడు.

"ఉషా నువ్వు కొంచెం పెట్టవే-శీనప్పకి" అన్నాడు రాజు.

"కొంచెమే రా నాకుంది" అంటూ రెండే ముక్కలు విరిచి శీనప్పకిచ్చింది ఉష. అందరూ జంతికలు తినటం ముగించాక "ఆడుకుందాం రండిరా" అన్నాడు చిట్టి.

"నేనేమో ప్లీడరుగారిని, రాజూ నువ్వేమో గుమాస్తావిరా.

# పాడైన ఆట

వాళ్లిద్దరు కేసులవాళ్లు. రండిరా. ఆడుకొందాం"

అంతా పరిగెత్తారు-ఉష తప్ప. ఉష మెల్ల మెల్లగా అడుగు లేసుకుంటూ "నేనూ రా" అంటూ వాళ్లతో చేరింది.

"మీ రిక్కడే ఉండండి" అని రాజు పరుగెత్తికెళ్లి చేయి విరిగిన కుర్చీ నొకదానిని వాకిట్లోంచి బరబరా యీడ్చుకొచ్చాడు. అంగులో కూర్చున్నాడు ప్లీడరుగారు-చిట్టి వాళ్లినాన్న కూర్చున్నట్టే కూర్చుని కాళ్లాడిస్తూ చేతిలో పొడుం నేసుకొన్నట్లు వట్టి నేళ్లే ఎడంచేతి అరచేతిలో దులిపి పొడుం పట్టు తీసి పీల్చినట్లు ఎగబీల్చి

"ఆ! ఆ! ఆహా! ఏమోయి గుమాస్తా; యింత ఆలస్యంగా వచ్చావేం?"



మూడుతలల కొబ్బరిచెట్టు
నెల్లూరుజిల్లా కోటవద్దఉంది.
ఫొటో: శ్రీ జి. ప్రసాదరావు, కోట.

"బజారుకెళ్లాను, ఆలీశమైంది-"

"అండి' అనాలిరా నువ్వు"

"ఎందుకూ? అక్కర్లేదురా!"

"అబ్బా అల్లా కాదురా! 'అండి' అనాలి."

"అయితే ఉండు మళ్ళీ అంటాను ... బజారుకండి వెళ్లానండీ! ఆలశ్య మైందండీ"

"ఊ! అల్లాగా! అయితే ఆ కేసువాళ్లొచ్చారా!"

"ఆ! వచ్చారురా"

"అబ్బబ్బ! మళ్లీ చెప్పాలిరా నీకు"

"తెలిసిందిలే-ఆ! వచ్చారండీ!"

"తీసుకురా, వాళ్లని ఇల్లాగ" రాజు వెనక్కెళ్లి శీనప్పని, ఉషనీ తీసుకువచ్చి, అక్కడ నుంచో పెట్టాడు.

"ఇదేంటిరా! మీ కేమీ చాతకాద్రా! 'దండం బాబయ్యా' అనాలి మీరు"

"శీనప్ప, ఉష మీరిద్దరు దండం బెట్టి-దండాలు బాబయ్యా-అనండి" తెలియనివాళ్లకు తెలియ చెప్పాడు రాజు. ఇద్దరూ దండం పెట్టారు. శీనప్ప "దండం బాబయ్యా" అన్నాడు.

"దళ్ళం బాబయ్యా" అన్నది ఉష.

"అయ్యో, ఉషకు సరిగ్గా మాట్లాడ్డం రాదురా చిట్టీ"

"ఒరే నిన్ను కొడతానంతే! నువ్వల్లా మాట్లాడకూడదు - నేను నాన్నని; 'రా' 'గీ' అనకూడదు మీరిద్దరు కేసువాళ్లు తెలిసిందా?"

"అయితే నాకక్కర్లేదు-వెళ్లిపోతానులే-అమ్మతో చెబతానుండు" అన్నాడు శీనప్ప.

"ఉండు-ఉండు! యీ ఆటొద్దురా - మాష్టారుఆట ఆడుకుందాం రండి-ఎంచక్కాను."

"ఔను రా!...ఔను! నేను జగన్నాథం మాష్టార్ని-మీరంతా పిల్లలుట."

అయితే "ఉండ్రా మరి" అని శీనప్ప లోపలికి పరిగెత్తుకెళ్లి ఒకచేతితో బోడిపలక పట్టుకొని యింకో చేతితో చింకిచాప యీడ్చుకొచ్చాడు.

"చాపేస్తానురా"


"నాకూ-డా పలక" అంది ఉష.

"పలక లొద్దు - పలకలు లేకుండా నే ఆడుకొందాం"

"సరే నేను వీధిలోంచి వస్తానట"



తొమ్మిదితలల తాడి
కోట (నెల్లూరుజిల్లా) వద్ద కొక్కుపాడుకు రెండుమైళ్ళ దూరంలో వుంది.
ఫొటో: శ్రీ జి. ప్రసాదరావు, కోట.



అని వీధి గుమ్మంలోకి వెళ్ళి పోయాడు.

వాళ్ల జగన్నాథంమాష్టరు ఎప్పుడూ కారపు కిళ్లీ నములుతూ వచ్చేముందు ఖాండ్రించి-ఉమ్మేసే వాడు.

చిట్టిగాడు కూడా "క్రాం-క్రాం-తుః పు" అనుకుంటూ "ఓయీ! శీనప్పా! చాప తేవోయి" అన్నాడు చిట్టి.

"వేత్తా నుండరా చాప... ఆ! కాదు కాదు వేత్తానుండండి" అని చాప పరిచాడు.

"ఆ! రండి" అని బాసింపట్టు వేసుకు కూర్చుని—

"రాజూ! నువ్వు మధ్యనుండు, శీనప్పా! నువ్వు ఇక్కడ - ఉష ఆపక్కన అల్లా కూర్చోండి" అని అదమాయించాడు.

"ఊ! మాట్లాడకండి."

"సిట్ - అంటే నుంచోండి అంతా. ఆ! ఆ! కాదు! ఉండండి స్టాండు"

(అంతా నుంచుంటారు - ఉష నుంచోదు)

"ఉషా నువ్వుకూడా-

"సిట్"-(అంతాకూర్చుంటారు)

"సిట్, స్టాండు, సిట్" - అని మూడు సార్లంటాడు. వాళ్లు నుంచునేఉంటారు. ఒక్కళ్లూ కూర్చోరు.

"పాఠం చెబతాను వ్రాయండి-అబ్బాయిలూ"

"అబ్బా! మీకు తెలవదు కూర్చోండిరా" - అని విసుగు కొన్నాడు చిట్టి.

అంతా కూర్చున్నారు. పాఠం మొదలు పెట్టాడు.

"పూర్వము ... వ్రాయండి-పూర్వము ధసరదుడు-ధసరదుడు-"

"ధసరదుడు కాదురా దశరధుడు", రాజు తప్పు సవరించబోయాడు.

"నీకు తెలీదురా"-

"పూ...తర్వాత ఏమిటిరా అన్నయ్యా? కాదు కాదు-మాష్టారు?" శీనప్ప అడిగాడు.

"ఉష రాయడం లేదురా మరి" అని రాజు అంటూండగానే-'అసలు జగన్నాథం మాష్టారు' వీధిలోంచి 'చిట్టీ' అనిపిలుస్తూ లోపలికిఅడుగు పెట్టారు. అంతా చాప, పలక వదిలేసి తలో చోటికి పరుగెత్తి పోయారు.

"అ! అ! అన్నయ్యా నేనోడా" అంటూ ఉష కూడా తప్పటడుగులు వేసుకొంటూ వాళ్ళింటికి పరుగెత్తింది.

"ఏమోయి చిట్టీ! ఓచిట్టీ,... శీనప్పా, ఓశీనప్పా"అంటూ 'అసలు జగన్నాథంమేస్టారు' గొంతు చించుకు అరుస్తూనేవున్నాడు. కానీ ఎవరు పలకరు-ఎవరు రారు.

"ఒరేయి రాజూ!" అని పిలిచాడు మేస్టారు.

ఏడీ-రాజు మాత్రం ఏడీ! ★